ప్రజాశక్తి
మంగళవారం 23 సెప్టెంబర్ 2025
5
పార్వతీపురం మన్యం

గుజరాత్ హైకోర్టు జడ్జి సిహెచ్.మానవేంద్రనాద్‌రాయ్‌ను ఎస్‌పి ఎస్.వి. మాధవ్ రెడ్డి సోమవారం ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు.
-ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ధర్నాలతో దద్దరిల్లిన కలెక్టరేట్

కలెక్టర్‌కు సమస్యను విన్నవిస్తున్న కృష్ణమూర్తి

రికార్డు స్థాయిలో అర్జీల వెల్లువ
బడిదేవర కొండపై మైనింగ్ లైసెన్స్ రద్దు చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లా కలెక్టర్‌తో సహా సబ్ కలెక్టర్లు, ఐటిడిఎ పిఒలుగా కొత్త అధికారులు బాధ్యతలు స్వీకరించిన తర్వాత నిర్వహించిన తొలి ప్రజాసమస్యల పరిష్కార వేదికపై కోటి ఆశలతో జిల్లా నలుమూలల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కొద్ది రోజుల క్రితం జిల్లా కలెక్టర్‌గా డాక్టర్ ఎన్.ప్రభాకర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత జరిగిన మొదటి గ్రీవెన్స్ సెల్‌లో జనాల నుంచి అర్జీలు వెల్లువలా వచ్చాయి. రికార్డు స్థాయిలో 280 అర్జీలు వచ్చాయి. ఎప్పటిలాగే అధికసంఖ్యలో వ్యక్తిగత సమస్యలపై అర్జీలు రాగా మరికొన్ని సామాజిక సమస్యలపై వచ్చాయి. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వలు సంఘాల నాయకుల ఆధ్వర్యాన ఉద్యోగులు, బాధిత ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.

బడి దేవర కొండపై మైనింగ్ లైసెన్స్ రద్దు చేయాలి
ఎం.కృష్ణమూర్తి, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

మండలంలోని గంగాపురం పంచాయతీ పరిధిలోని బడిదేవర కొండపై గ్రానైట్ తవ్వకాలకు జారీ చేసిన అనుమతులను రద్దు చేయాలని కోరుతూ ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ సెల్ లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడిదేవర కొండపై మైనింగ్ తవ్వకాలకు అన్ని అనుమతులు ఉన్నాయని మైనింగ్ అధికారులు చెబుతున్నారని, కానీ ఏ విధమైన అనుమతులూ లేవని చెప్పారు. గ్రానైట్ తవ్వకాల వల్ల విడుదలైన బూడిద ని సమీపంలో ఉన్న చెరువులోకి వదిలేయడంతో పాడి బంగారి దొర అనే గిరిజనుడు చేపల వేటకు దిగి మృత్యువాత పడ్డాడని చెప్పారు. నిబంధనల ప్రకారమైతే మైనింగ్ కంపెనీ బూడిదను నిల్వ చేసుకోడానికి ప్రత్యేకంగా గుంటలు తవ్వుకోవాల్సి వుందన్నారు. అలా చేయకపోవడంతో అమాయక గిరిజనుడు బంగారి దొర మృతి చెందాడని, దీనికి కారణం మైనింగ్ యాజమాన్యమేనని చెప్పారు. పాడి బంగారి దొర కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని, యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సమస్యలపై విద్యుత్ ఉద్యోగుల జెఎసి ర్యాలీ

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎపి స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యాన జిల్లాలోని విద్యుత్ శాఖ ఉద్యోగులు స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జెఎసి కన్వీనర్ రాయల సత్యనారాయణ మాట్లాడుతూ విద్యుత్ శాఖ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని కోరారు. గతంలో ఉద్యోగ సంఘాల నాయకులతో కుదిరిన ఒప్పందాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే భవిష్యత్తులో పోరాటానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

చెక్ పవర్ పునరుద్ధరించాలని సర్పంచ్ వినతి

రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా రద్దు చేసిన తన చెక్ పవర్‌ను పునరుద్ధరణ చేయాలని రావికోన సర్పంచ్ కద్రక రామస్వామి సోమవారం జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ సెల్ లో వినతిపత్రం అందజేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడుతో కలిసి ఆయన కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అధికారపార్టీ నాయకుల ఒత్తిళ్ల కు తలొగ్గిన డిపిఒ తప్పుడుఫిర్యాదు ఆధారంగా విచారణ జరిపి చెక్ పవర్ రద్దు చేయడం దుర్మార్గమని చెప్పారు.

సమస్యలు పరిష్కరించాలని విద్యుత్ ఉద్యోగుల ధర్నా
చెక్‌పవర్ పునరుద్ధరించాలని సర్పంచ్ డిమాండ్

కాలేజీ వంటమనుషుల కు జీతాలు చెల్లించాలి

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంచి బలోపేతం చేయాలని, జూనియర్ కాలేజీల్లో వంటమనుషులకు గత ఎనిమిది నెలల జీతాల బిల్లులు చెల్లించాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు.ఏపీ మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ అద్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్ష కార్యదర్శులు జి తులసి, వై శాంతి కుమారి మాట్లాడుతూ భోజన పథకం నిర్వాహకులకు జీతాలు పెంచి, మెస్ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజనం నిర్వాహకుల సంఘం నాయకులు డ్రైవర్ అమ్మ, సుశీల, పావని, యు లక్ష్మి, గౌరమ్మ, సుశీల, సుమలత, మణి కుమారి, పద్మ, మీనా,తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న విద్యుత్‌శాఖ ఉద్యోగులు

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న కోదుపెద్దవలస విద్యార్థినులు

బడి కావాలని చిన్నారుల ధర్నా

తమకు చదువుకునేందుకు ప్రభుత్వం బడి నిర్మించాలని కోరుతూ మక్కువ మండలం మార్కొండపుట్టి పంచాయతీ కోదు పెద్ద వలస గ్రామానికి చెందిన 43మంది చిన్నారులు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సిపిఐఎంఎల్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యాన విద్యార్థులు ధర్నా చేశారు. 13ఏళ్లుగా ప్రభుత్వ బడికి భవనం లేక చెట్టు కింద చదువుతున్నామని చెప్పారు. గ్రామంలో మోడల్ పాఠశాల ఉన్నప్పటికీ భవనం మంజూరు చేయకపోవడం అన్యాయమని అన్నారు. నలుగురు ఉపాధ్యాయులు వున్నా భవనం లేకపోవడం రోజుకొకరి ఇంటి దగ్గర చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎన్.ప్రభాకర్ రెడ్డి కి వినతిపత్రం అందజేశారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల పై వేధింపులు ఆపాలి

ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌లపై రికవరీల పేరుతో వేధింపులు ఆపాలని, కనీస వేతనాలు చెల్లించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన ఫీల్డ్ అసిస్టెంట్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, జిల్లా కార్యదర్శి బివి రమణ మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ల కు భద్రత కల్పించాలని, స్టేషనరీ ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. జాబ్ కార్డులు స్టేషనరీ, రికార్డులు ప్రభుత్వమే సరఫరా చేయాలని లేనిచో విధులను బహిష్కరించేందుకు ఫీల్డ్ అసిస్టెంట్లు సిద్ధపడతారని హెచ్చరించారు. కార్యక్రమం లో సిఐటియు నాయకులు గొర్లి వెంకటరమణ, బి సూరిబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం నాయకులు ఎం.హరనాథ్, వెంకటరమణ, ఆర్.ఆదినారాయణ, ఎ. సంగం నాయుడు, మోహన్ దాస్ పాల్గొన్నారు.

గురజాడ రచనలు స్ఫూర్తిదాయకం: కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

తెలుగు సాహిత్యానికి ఉన్న శక్తిని ప్రపంచానికి చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి గురజాడ వెంకట అప్పారావు అని, ఆయన రచనలు స్ఫూర్తిదాయకమని కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి కొనియాడారు. తన రచనలతో సమాజాన్ని మేల్కొలిపిన మహాకవి గురజాడ అని అన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సంఘ సంస్కర్త గురజాడ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. తొలుత గురజాడ వెంకట అప్పారావు చిత్ర పటానికి కలెక్టర్ పూలమాలను వేసి

గురజాడ చిత్ర పటం వద్ద జ్యోతిప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

నృత్యం చేస్తున్న చిన్నారి

జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సరళమైన తెలుగు భాషను వాడుక భాషగా తీసుకొచ్చిన వారిలో గిడుగు వెంకట రామ్మూర్తి తంర్వాత గురజాడ ముందున్నారని గుర్తుచేశారు. 125 ఏళ్ల క్రితం చేసిన కన్యాశుల్కం, పుత్తడి బొమ్మ పూర్ణమ్మ వంటి పాత్రలతో రూపొందించిన కథలు నాటి నుండి నేటి వరకు సమాజ స్థితిగతులను ప్రతిబింభిస్తున్నాయని తెలిపారు. దేశమంటే మట్టి కాదోయ్... దేశమంటే మనుషులోయ్ అని చాటి చెప్పిన గురజాడ స్ఫూర్తి ఎప్పటికీ సజీవంగా ఉంటుందని పేర్కొన్నారు. అటువంటి మహనీయుని కవితలు, రచనలు ఈ తరం విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని అన్నారు. విద్యార్థుల తీరిక సమయాల్లో అటువంటి వాటిని సోషల్ మీడియా ద్వారా తెలుసుకోవడం, వినడం వంటివి చేయాలని సూచించారు. జెసి యశ్వంత్‌కుమార్‌రెడ్డి, డిఆర్ఒ కె.హేమలత మాట్లాడుతూ రచయిత, సంఘ సంస్కర్త, సాహితీకారుడు, హేతువాది, అభ్యుదయ కవి, తెలుగుభాష మహాకవి, సమాజ జాగృతికి వెలుగు జాడ గురజాడ అప్పారావు అని కొనియాడారు. సాహితీవేత్తలు గంట్యాడ గౌరినాయుడు, చింతా అప్పల నాయుడు, సిరికి స్వామినాయుడు, తుంగళి శివాజి, పి.చక్రధర్ తదితరులు గురజాడ గొప్పతనాన్ని కీర్తించారు. ఈ సందర్భంగా పలు విద్యా సంస్థలకు చెందిన విద్యార్థినిలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో ప్రత్యేక ఉప కలెక్టర్ ఎస్.దిలీప్ చక్రవర్తి, అధికారులు పాల్గొన్నారు.

ఏడాదికి మూడు పంటలు వేసేలా ప్రణాళికలు : కలెక్టర్

పార్వతీపురం : జిల్లాలోని రైతులు ఏడాదికి మూడు పంటలు వేసేలా ప్రణాళికలు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి వ్యవసాయాధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వాణిజ్య పంటలపై రైతులు దృష్టి సారించేలా అవగాహన కల్పించాలని సూచించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిజిఆర్ఎస్‌లో వచ్చిన ప్రతి వినతికీ ఎండార్స్‌మెంట్ చేయాలన్నారు. ఆర్థికపరమైన సమస్యలతో పాటు ఆర్థికేతర సమస్యలు ఉంటాయని, అటువంటి వినతులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ శాఖలో వచ్చిన అన్ని సమస్యలు పరిష్కరించలేమని, కానీ ఫిర్యాదుదారులు సంతృప్తి చెందేలా సమాధానం ఇవ్వాలని చెప్పారు. ఇపిటిఎస్ డాక్యుమెంట్ అప్‌లోడ్ చేయు నిమిత్తం మంగళవారం ఉదయం 10 గంటలకు జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లకు శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. వివిధ శాఖలపై పలు దిన పత్రికల్లో ప్రచురితమవుతున్న ప్రతికూల వార్తలపై జిల్లా అధికారులు తక్షణమే స్పందించాలన్నారు. సమస్యలపై వార్తలు రాక ముందే, ఆ సమస్యలను అధికారులు పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో జెసి సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డిఆరొ కె.హేమలత, ప్రత్యేక ఉప కలెక్టర్ ఎస్.దిలీప్ చక్రవర్తి ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పని గంటల పెంపునకు వ్యతిరేకంగా ఉద్యమించాలి : సిఐటియు

ప్రజాశక్తి - సీతానగరం

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న పని గంటల పెంపునకు వ్యతిరేకంగా కార్మికవర్గం ఉద్యమించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు పిలుపునిచ్చారు. ఫ్యాక్టరీలు, షాపులు, సంస్థల్లో కార్మికుల పని గంటల పెంచుతూ సెప్టెంబర్ 19న అసెంబ్లీలో కూటమి ఆమోదించడానికి వ్యతిరేకంగా సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్మిక వ్యతిరేక చర్యను సిఐటియు ఖండిస్తోందని అన్నారు. ఈ బిల్లును కౌన్సిల్లో ఆమోదానికి పెట్టే అవకాశం ఉందని, కౌన్సిల్లోని పిడిఎఫ్, వైసిపి సభ్యులు వ్యతిరేకించాలని, బిల్లుకు వ్యతిరేకంగా ఓటు చేయాలని కోరారు. మహిళలను రాత్రిపూట కూడా పని చేయడాన్ని అనుమతించడం దారుణమన్నారు. కార్మిక వ్యతిరేక బిజెపి, కూటమి ప్రభుత్వ విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు గవర వెంకటరమణ, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షులు రెడ్డి ఈశ్వరరావు, భవన నిర్మాణం కార్మిక నాయకులు రాయపల్లి సింహాచలం, కృష్ణ, అప్పారావు, అంగన్వాడీ సిబ్బంది సునీత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం: కార్మికులు, ఉద్యోగులు 8 గంటల నుంచి 13 గంటలు పని చేయాలని నిర్ణయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. దీనికి నిరసనగా సిఐటియు ఆధ్వర్యాన కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు ,కోశాధికా గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ అసెంబ్లీలో 8 గంటల పని విధానాన్ని 13 గంటలుగా మారుస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక, ఉద్యోగ వ్యతిరే

ఆందోళన చేస్తున్న సిఐటియు నాయకులు

విధానాలకు వ్యతిరేకంగా కార్మిక ఉద్యోగం వర్గాలు పోరాడుతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు, బి.వి రమణ, రెడ్డి వేణు, వి.ఇందిరా, బి లక్ష్మి, శాంతి కుమారి, బి సూరిబాబు, హరినాథ్, సింహాచలం, వివిధ రంగాల కార్మికులు పాల్గొన్నారు.

వీరఘట్టం : పని గంటలు పెంపుకు వ్యతిరేకంగా కార్మిక వర్గం ఉద్యమించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిరా పిలుపునిచ్చారు. స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. కార్మిక వ్యతిరేక బిజెపి కూటమి ప్రభుత్వం విధానాలపై పోరాటం చేయాలని కార్మికులకు ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎన్ ప్రసాదరావు, ఎన్.సింహాచలం, వై.ప్రసాదరావు, వి.కాంచన, పి.లక్ష్మి తదితర కార్మికులు పాల్గొన్నారు.

అచ్చభలో విషాదం
చెరువులో పడి ఇద్దరు విద్యార్థినులు మృతి

మృతి చెందిన అంజలి

ప్రజాశక్తి - సీతంపేట

నిన్న వరకూ పాఠశాలలో చదువుకొని దసరా సెలవులకు సొంత గ్రామంలో సరదాగా గడుపుదామని, ఈత కోసం చెరువుకు వెళ్లిన ఇద్దరు విద్యార్థినిలు మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. మండలంలో పెద్దగూడ పంచాయతీ అచ్చభలో చోటు చేసుకున్న విషాదకర సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

మండలంలోని పెద్దగూడ పంచాయతీ అచ్చబ గ్రామానికి చెందిన కొండగొర్రె మౌనిక (12) ఏడో తరగతి, పాలక రాజి అలియాస్ అంజలి (11) మండలంలోని ముత్యాలు గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నారు. ఆదివారం నుంచి దసరా సెలవులు కావడంతో సొంత గ్రామానికి వచ్చారు. సోమవారం వీరు విషిత, శ్రావ్యతో కలిసి గ్రామ శివారులో గల చెరువు స్నానాకి వెళ్లారు. తొలుత చెరువులోకి మౌనిక, అంజలి దిగి తిరిగి ఒడ్డుకు రాకపోవడంతో మిగిలిన ఇద్దరూ

మృతి చెందిన మౌనిక

గ్రామంలోకి వెళ్లి విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పారు. దీంతో పోలీసులకు, రెవెన్యూ శాఖకు సమాచారం అందించారు. ఈ విషయం తెలిసిన వెంటనే ఆర్ఐ విజయ గణేష్‌బాబు గ్రామాన్ని సందర్శించి స్టేట్మెంట్ రికార్డు చేశారు. ఇద్దరు ఒకే పాఠశాలలో, ఒకే గ్రామం ఒకేసారి మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. దోనుబాయి ఎస్ఐ షేక్ మస్తాన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా కోట దుర్గ నవరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి - పాలకొండ

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే జయకృష్ణ దంపతులు

పట్టణంలో కోట దుర్గమ్మ దసరా నవరాత్రి ఉత్సవాలు సోమవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 7:30 గంటలకు అమ్మవారి రాటయ్యాగా 8 గంటల నుంచి నిజరూప దర్శనం కల్పించారు. సుమారు 30,000 మంది వరకు చుట్టుపక్కల నుంచి యాత్రికులు ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కార్య నిర్వాహ అధికారి వివి సూర్యనారాయణ దగ్గరుండి ఏర్పాట్లు పర్యవేక్షించారు. కూలైన్ ద్వారా భక్తులకు అమ్మవారి దర్శనానికి కల్పించారు. వంద రూపాయలు, రూ.30 టిక్కెట్లు కూడా విక్రయించారు. వచ్చిన యాత్రికులకు అన్న ప్రసాద సౌకర్యాన్ని కూడా కల్పించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు పల్లా కొండలరావు ఆధ్వర్యంలో పట్టణ టిడిపి అధ్యక్షులు గంటా సంతోష్ కుమార్‌తో పాటు మరికొంతమంది దగ్గరుండి అన్న ప్రసాద కార్యక్రమాన్ని పరివేక్షించారు. డిఎస్‌పి ఎం.రాంబాబు, తహశీల్దార్ రాధాకృష్ణమూర్తి దగ్గరుండి ఏర్పాట్లు పర్యవేక్షించారు. క్యూలైన్లతో పాటు వచ్చిన యాత్రికులకు సౌకర్యాలు అందుతున్నాయా లేదా అన్న దానిపై ఆరా తీశారు.

ప్రముఖుల తాకిడి

ఎమ్మెల్యే నిమ్మక జయకష్ణ దంపతులు ముందుగా కోట దుర్గమ్మ వారికి పట్టు వస్త్రాలు సమర్పించి ఉత్సవాలను ప్రారంభించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ యశ్వంత్‌రెడ్డి, విజయనగరం అదనపు జిల్లా జడ్జి నాగమణి, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, సబ్ కలెక్టర్ పవర్ స్వప్నల్ జగన్నాథ్, మాజీ ఎమ్మెల్యే వి. కళావతి, ఎంపిపి బొమ్మలు భాను అమ్మవారిని దర్శించుకు న్నారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకులు లక్ష్మీ ప్రసాద్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సామాన్యులకు తప్పని తిప్పలు

కోట దుర్గమ్మ వారి ఉత్సవాల మొదటి రోజు సోమవారం పోలీసులతో సామాన్యులకు తిప్పలు తప్పలేదు. యాత్రికులను క్యూలైన్లో సరిగ్గా పంపించలేక ఇబ్బందులు ఎదురయ్యాయి. పాలకొండతో పాటు చుట్టు పక్క ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో యాత్రికులు రావడంతో రద్దీ ఎక్కువైంది. పోలీసులు బంధుప్రీతి, స్వామి భక్తి చూపించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా వారి బంధువులను, స్నేహితులను అడ్డ మార్గంలో తీసుకువెళ్లేందుకు ఆసక్తి చూపారన్న విమర్శ లు బహిరంగనే వినిపిస్తు న్నాయి. దీంతో సామాన్య భక్తులకు ఇబ్బందులు తప్పలేదు. దేవాదాయ శాఖ జారీ చేసిన పాసులు కూడా లెక్కచేయకుండా నచ్చిన వారికి అనుమతించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

యుటిఎఫ్ రణభేరి సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - పార్వతీపురం

రణభేరి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఈనెల 25న గుంటూరులో వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరగబోయే యుటిఎఫ్ రణభేరి సభను విజయవంతం చేయాలని యుటిఎఫ్ మన్యం జిల్లా నాయకులు కోరారు. సోమవారం స్థానిక డిఇఒ కార్యాలయం వద్ద రణభేరి సభ పోస్టర్ను ఆవిష్కరిస్తూ సెప్టెంబర్ 15 నుంచి 19 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన రణభేరి ప్రచార జాతకు కొనసాగింపుగా ఈ సభను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్రావు పేర్కొన్నారు. రణభేరి జాతా సందర్భంగా యుటిఎఫ్ గుర్తించిన సమస్యలతో పాటు ఉపాధ్యాయులు కూడా వారి సమస్యలను రాష్ట్ర నాయకత్వానికి వినతుల రూపంలో అందజేశారని, వీటన్నిటిని క్రోడీకరించి ఈ సభ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం దగ్గర డిమాండ్లు ఉంచనున్నట్లు ఆయన పేర్కొన్నారు. యుటిఎఫ్ మన్యం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి రమేష్, కె భాస్కరరావు మాట్లాడుతూ విద్యారంగంలో అనేక సమస్యలు పేరుకు పోయాయని అదేవిధంగా ఉపాధ్యాయులు ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక బకాయిలను ఈ ప్రభుత్వం చెల్లించడానికి ఎటువంటి చొరవ చూపలేదని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర విద్యా విధానాన్ని ప్రకటించాలని, ఉపాధ్యాయులకు బోధ నేతర కార్యక్రమాల నుంచి విముక్తి కల్పించాలని, పాఠశాలల్లో సక్రమంగా విద్యార్థులకు బోధన చేసేందుకు తగిన పరిస్థితులు కల్పించాలని వారు కోరారు. 12వ పిఆర్సి కమిషన్ను తక్షణమే నియమించి మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి, ఆర్థిక బకాయిలు చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు మ్యాప్ విడుదల చేయాలని, సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఈ సందర్భంగా నాయకుల కోరారు.

సీతానగరం : ఈనెల 25న గుంటూరులో యుటిఎఫ్ తలపెట్టిన రణభేరి బహిరంగ సభకు మండల నుంచి అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని యుటిఎఫ్ సీతానగరం మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పల్లె శ్రీనివాసరావు, బొత్స ప్రసాదరావు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం వారు ఒక ప్రకటన విడుదల చేస్తూ కొత్త ప్రభుత్వం ఏర్పడి సుమారు 16 నెలల సమయం గడిచినప్పటికీ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పట్ల తీవ్ర నిర్లక్ష్య వైఖరి అనుసరిస్తున్నందున పెండింగ్ ఆర్థిక బకాయిలను చెల్లించాలని, పిఆర్‌సి కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, పెండింగ్ డిఎలను చెల్లించాలని, ఐఆర్‌ను తక్షణమే ప్రకటించాలని,కోరారు. పై సమస్యల పరిష్కారం కోరుతూ యుటిఎఫ్ రాష్ట్ర శాఖ జరపతలపెట్టిన రణభేరి రాష్ట్ర మహాసబ ్లో ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

డాక్టర్ నిర్లక్ష్యం వల్లే గర్భిణి మృతి
కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసిన కుటుంబం

ప్రజాశక్తి-పార్వతీపురం

పాలకొండ ఏరియా ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం వల్లే తన భార్య బొమ్మాళి పద్మ మృతి చెందిందని ఆమె భర్త బొమ్మాళి రవికుమార్ సోమవారం జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేశారు.పాలకొండ మండలం తంపటావల్లికి చెందిన నిండు గర్భిణి పద్మని ఈనెల ఆగష్టు 27న ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్ళి నట్లు చెప్పారు. ప్రసవం నొప్పులు రావడంతో ఉదయం 9.30 గంటలకు తీసుకెళ్తే ఆ సమయంలో వైద్యులెవరూ లేరని తెలిపారు. ఆలస్యంగా వచ్చిన గైనకాలజిస్ట్ డాక్టర్ భారతి పద్మని చూసేసరికి చాలా ఆలస్యమైందని చెప్పారు. అప్పటికే ఆసుపత్రిలో విధుల్లో ఉన్న స్టాఫ్ నర్స్ ఇంజెక్షన్ చేశారని, ఆ విషయం తెలుసుకున్న డాక్టర్ భారతి ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేశారని తెలిపారు. గైనకాలజిస్టు భారతి ఆలస్యంగా రావడం, స్టాఫ్ నర్స్ తెలిసీ తెలియని వైద్యం అందించడంతో పద్మ మృతి చెందిందని చెప్పారు. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్‌కి ఫిర్యాదు చేసే నిర్లక్ష్యం గా మాట్లాడారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ఇద్దరు చిన్న పిల్లలు వున్నారని, తాను దళిత నిరుపేద కుటుంబానికి చెందిన వాడినని చెప్పారు. పాలకొండ ఏరియా ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యంపై తన భార్య మరణించడంపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి

కురుపాం : ఈనెల 25న స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న రక్తదాన శిబిరాన్ని పెద్ద ఎత్తున యువత పాల్గొని జయప్రద ం చేయాలని సూపరింటెండెంట్ కె. సందీప్ కోరారు. పిల్లలకు, స్త్రీలకు రక్తహీనత లేకుండా చూడడమే ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశమన్నారు. కావున రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

ఆయుధ పూజ చేస్తున్న కేంద్ర మాజీ మంత్రి కిశోర్‌చంద్రదేవ్ దంపతులు

ఖడ్గదుర్గకు ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - కురుపాం

దసరా నవరాత్రులు ప్రారంభం సందర్భంగా కేంద్ర మాజీ మంత్రి వైరచర్ల కిషోర్ చంద్ర దేవ్ దంపతులు కురుపాం కోటలో వెలిసిన ఖడ్గ దుర్గా అమ్మవారికి వేద పండితుల మధ్య సోమవారం ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటలో వెలిసిన ఖడ్గదుర్గ తల్లికి ప్రతి ఏటా దసరా నవరాత్రుల్లో ప్రత్యేక పూజలు నిర్వహించడనేది తమ తాత ముత్తాతల నుంచి వస్తున్న ఆచారమని, ప్రజలంతా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు.

అంగన్వాడీ భవనాలను పూర్తి చేయాలి

అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

కురుపాం నియోజకవర్గంలోని పలు మండలాల్లో నిర్మాణాల్లో ఉన్న అంగన్వాడీ కేంద్రాల భవనాల పనులను నిర్మాణాలు చేపట్టి పూర్తి చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అసెంబ్లీలో సోమవారం ప్రస్తావించారు. అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేక, కొన్ని శిథిలావస్థలో ఉండడంతో పరాయిపంచన విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. దీంతో విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరణం కోల్పోతున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు. అంగన్వాడి కేంద్రాల భవనాలు పూర్తిచేయాలని గిరిజన శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి ని అసెంబ్లీ సాక్షి గా కోరారు.

అంబేద్కర్ స్టడీ సర్కిళ్ల ద్వారా ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - పార్వతీపురం

అంబేద్కర్ స్టడీ సర్కిళ్ల ద్వారా నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ యువతకు పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు అభ్యర్థుల నుంచి ఈనెల 24 నుంచి అక్టోబరు 6 వరకు దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి తెలిపారు. తిరుపతి, విశాఖపట్నం కేంద్రాలుగా శిక్షణ ఉంటుందని, శిక్షణ కాలంలో అభ్యర్థులకు ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తారని సోమవారం ఓ ప్రకటనలో ఆయన తెలిపారు. ఐబిపిఎస్, ఆర్ఆర్‌బి, ఎస్ఎస్‌సి తదితర పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తారని, ఆసక్తి గల అభ్యర్థులు ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వీరికి ఆయా జిల్లా కేంద్రాల్లో అక్టోబరు 12న స్క్రీనింగ్ టెస్ట్ ఉంటుందని అన్నారు. మరిన్ని వివరాలకు 9949686306 నెంబరులో సంప్రదించాలని ఆయన ఆ ప్రకటనలో సూచించారు.

పిహెచ్‌సి వైద్యులు సమ్మెకు సన్నద్ధం

ప్రజాశక్తి - సీతంపేట

ఇన్-సర్వీస్ పిజి కోటాను పునరుద్ధరించాలని, టైమ్-బౌండ్ ప్రమోషన్లు అమలు చేయాలని కోరుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యులు సమ్మెకు సన్నద్ధమయ్యారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్స్ అసోసియేషన్ తరపున వైద్యులు భాను ప్రతాప్, చాందిని, సత్యవేణి, శివశంకర్ సోమవారం స్థానిక ఐటిడిఎ పిఒ పవర్ స్వప్నిల్ జగన్నాథ్ సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వారికి బేసిక్ పే 50శాతం ట్రైబల్ అలవెన్స్ మంజూరని, నోషనల్ ఇన్‌క్రిమెంట్స్, చంద్రన్న సంచార చికిత్స ప్రోగ్రామ్ కింద వైద్యులకు రూ.5000 అలవెన్స్, నేటివిటీ, అర్బన్ ఎలిజిబిలిటీ సమస్యల పరిష్కరించాలని కోరారు. అలాగే పిహెచ్‌సి వైద్యులకు ఖచ్చితమైన పని గంటలు, స్థిరమైన వారాంతపు సెలవు, వైద్యుల జాబ్ చార్ట్ ఇవ్వాలని కోరారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్లు ఎన్నిసార్లు ప్రభుత్వ దష్టికి తీసుకెళ్లినా ఇంతవరకు పరిష్కారం కాలేదు. దీంతో తాము నిరసనకు దిగక తప్పడంలేదని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం చర్యలు తీసుకుని సమస్యలను పరిష్కరించకపోతే, గురువారం సమ్మె కార్యాచరణ ప్రకటించి నిరవధిక సమ్మెకు దిగుతామని తెలిపారు. వైద్య సేవల్లో అంతరాయం కలగడంపై పూర్తి బాధ్యత ప్రభుత్వానిదే అవుతుందని అన్నారు.

మాస్టారికి నివాళులర్పించిన రాజన్న దొర

ప్రజాశక్తి -మక్కువ

మండలంలో తాను చదువుకున్న రోజుల్లో విద్యాబుద్ధులు నేర్పిన తెలుగు మాస్టారు పెంట సింహాచలం మృతదేహానికి మాజీ డిప్యూటీ సీఎం రాజన్న దొర నివాళులర్పించారు. మండలంలోని కవిరిపల్లికి సింహాచలం మాస్టారు అనారోగ్య కారణాలతో సోమవారం మృతి చెందారు. ఈ మేరకు రాజన్నదొర మాస్టారు మృతదేహానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు ఎం శ్రీనివాసరావు వైసీపీ మండల అధ్యక్షులు రంగు నాయుడు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చిన జనసేన నాయకులు

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలోని వీరఘట్టం రోడ్డు జంక్షన్ వద్ద కార్గిల్ రోడ్డు వద్ద గుంతలు పడి చాలా రోజులుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆదేశాల మేరకు పట్టణ జనసేన నాయకులు కొండదాడి రాజేష్ తన సొంత నిధులతో గుంతలను పుడ్చారు. దసరా రోజుల్లో గుంతలను పూడ్చి ట్రాఫిక్ సమస్యలను తీర్చడంలో సహకరించినందుకు డిఎస్‌పి రాంబాబు, సిఐ ఎ.ప్రసాద్, ఎస్ఐ ప్రయోగమూర్తి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి బొమ్మాళి సుధ, ఎఎంసి డైరెక్టర్ డొంక శివప్రసాద్, జనసేన నాయకులు, మిడతాన ప్రసాద్, పొగిరి వెంకటరమణ, పొట్నూరు శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

టార్పాలిన్లు పంపిణీ

ప్రజాశక్తి - పాచిపెంట

నాబార్డ్, ఆర్ట్స్ సంస్థ ద్వారా పెద్దగెడ్డ ఎఫ్‌పిఒ బట్నాయక వలసలో టార్పలిన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు మాట్లాడుతూ పెద్దగెడ్డ ఎఫ్‌పిఒ సంస్థలో లేని రైతులకు కూడా టార్పలిన్లను అందిస్తుందని బయట ధర కంటే తక్కువ రేటులో నాణ్యమైన టార్పాలిన్లను అందిస్తుందని కావలసిన రైతులు వ్యవసాయ శాఖను సంప్రదిస్తే అందిస్తుందని తెలిపారు వీటితో పాటు స్ప్రేయర్లను కూడా తక్కువ ధరకు అందిస్తామని ఎఫ్‌పిఒ సాలూరు డివిజన్ కోఆర్డినేటర్ ప్రకాష్ తెలిపారు. అలాగే ప్రకృతి సేద్య ఉత్పత్తులకు నాణ్యమైన ధర అందేలా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ట్స్ ప్రతినిధి లతీఫ్, ఎఫ్‌పిఒ చైర్మన్ రామారావు, డైరెక్టర్ లక్ష్మణరావు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి - సీతానగరం



ఎగిసిపడుతున్న మంటలు

విద్యుత్ షార్ట్ సర్క్యులేషన్ వల్ల సీతానగరంలోని పాత ఆంధ్రా బ్యాంకు పక్కన ఉన్న రెండుచోట్ల అగ్నిప్రమాదాలు జరిగాయి. సుమారు రూ.2లక్షల వరకు ఆస్తి నష్టం వాటిలినట్లు తెలిసింది. రెవెన్యూ అధికారులు అందించిన వివరాల మేరకు యూడాది శ్రీదేవి, యాడాది ప్రసాదరావు ఇళ్లు పక్కపక్కనే ఉన్నాయి. శ్రీదేవి ఇంట్లో విద్యుత్ షార్ట్ వల్ల అగ్ని ప్రమాదం సంభవించి ఇంట్లో ఉన్న రెండు గ్యాస్ సిలిండర్లు పేలిపోయాయి. దీంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు ఎవరికీ ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. స్థానికులు వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వగా, సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. శ్రీదేవి ఇల్లు పూర్తిగా కాలిపోయింది. పక్కనున్న ఇల్లు పాక్షికంగా దెబ్బతిన్నట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ సంఘటన స్థలాన్ని తహశీల్దార్ జె.ప్రశాంత్ కుమార్, ఆర్ఐ ఎన్.శ్రీనివాసరావు, విఆర్ఒ పి.కుమార్ పరిశీలించారు. అలాగే సర్వం కోల్పోయిన రెండు కుటుంబాలకు ఎల్‌విఆర్ సంస్థ అధినేత, పెద బోగిలి వైస్ సర్పంచ్ కె.అరవింద్ కుమార్ ఆర్థిక సహాయం అందిస్తూ భోజన సౌకర్యాన్ని కల్పించారు.

ప్రతి సమస్యా పరిష్కారం కావాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు (పీజీఆర్ఎస్) వచ్చిన ప్రతి సమస్య పరిష్కారం కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన పిజిఆర్ఎస్ జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి వినతులను కలెక్టర్ స్వీకరించగా, జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, డిఆర్ఒ కె.హేమలత ఇందులో భాగస్వామ్యం అయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ రోజు నిర్వహించిన పీజీఆర్ఎస్ కు 280 వినతులు అందాయని తెలిపారు. ప్రతి అర్జీని క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లాపోలీసు కార్యాలయంలో....

పార్వతీపురంటౌన్ : ప్రజలు పోలీస్‌శాఖతో తమ సమస్యలను నేరుగా చెప్పుకునేందుకు ఈ వేదిక అవకాశం అని జిల్లా ఎస్పీ ఎస్ వి మాధవరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 13 మంది ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్పీ తో పాటుగా డిసిఆర్బీ సిఐ ఆదాం, సి సి ఎస్ సిఐ అప్పారావు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

ఐటిడిఎ గ్రీవెన్స్‌కు 60 వినతులు

సీతంపేట : స్థానిక ఐటిడిఎ పిఒ పవర్ స్వప్నిల్ జగన్నాథ్ ఆధ్వర్యంలో ఐటిడిఎలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గిరిజన ప్రజలు తమ సమస్యలపై వినతి పత్రాలను సమర్పించారు. మొత్తం 60 మంది వినతి పత్రాలను సమర్పించారు. కార్యక్రమంలో ఎపిఒ జి.చిన్నబాబు, డిడి అన్నదొర, ఇఇ రమాదేవి, డిప్యూటీ డిఇఒ రామ్మోహనరావు, ఎపిడి శ్రీహరిరావు, డిప్యూటీ డిఎంహెచ్ఒ విజయ పార్వతి, పిహెచ్ఒ గణేష్, పశుసంవర్ధక శాఖ ఎడి శ్రీనివాసరావు, ఇతర అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారులకు రూ. 5కే భోజన సదుపాయం

పార్వతీపురం : పిజిఆర్ఎస్‌కు వచ్చే అర్జీదారులకు రూ.5కే భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేయనున్నట్టు కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి పేర్కొన్నారు. ప్రతి సోమవారం పిజిఆర్ఎస్‌కు ఎంతో మంది అర్జీదారులు వ్యయ ప్రయాసల కోర్చి చాలా దూరం నుంచి వస్తుంటారని అన్నారు. అర్జీదారుల సౌకర్యార్థం ప్రతి సోమవారం వచ్చే సుమారు 500 మంది అర్జీదారులు ఈ భోజన సదుపాయాన్ని వినియోగించుకునే ఉద్దేశ్యంతో దీన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి అర్జీదారుడు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

డిగ్రీ కళాశాలల బంద్‌కు సంపూర్ణ మద్దతు: ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఫీజురీయింబర్స్మెంట్ బకాయిలు రూ.6400 కోట్లు విడుదల చేయాలని ఈనెల 22 నుంచి ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల సంఘం చేపడుతున్న నిరవధిక బంద్‌కు ఎస్ఎఫ్ఐ సంపూర్ణ మద్దతు ఇస్తుందని జిల్లా అధ్యక్షులు బి.అనిల్, ఉపాధ్యక్షులు ఎ.గంగారావు తెలిపారు. సోమవార స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఫీజుల బకాయిలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత రెండేళ్లుగా ఫీజులు పెండింగ్‌లో ఉన్నాయని పలుమార్లు ఎస్ఎఫ్ఐ, ఇతర విద్యార్థి సంఘాలు, కళాశాల యాజమాన్యాలు విన్నవిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వంలో స్పందన లేదన్నారు. దీంతో విద్యార్థులకు ఫీజులు రాకా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎస్‌వి యూనివర్శిటీలో సైతం డబ్బులు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని తెగేసిచెప్పడంతో ప్రిన్సిపల్ కార్యాలయ ఆవరణలో విద్యార్థులు అర్ధనగ్న ప్రదర్శన చేయడంతో యూనివర్శిటీ అధికారులు సర్టిఫికెట్లు ఇచ్చారని, ఇటువంటి ఘటనలు కోకొల్లలుగా వస్తున్నా, విద్యార్థులు ఇబ్బందులకు గురతున్నా ప్రభుత్వం ఫీజులు విడుదల చేయడంలో శ్రద్ధ చూపడంలేదన్నారు. ఎన్నడూలేని విధంగా యాజమాన్యాలే స్వయంగా బంద్‌కు పిలుపునివ్వడం కూటమి ప్రభుత్వం అసమర్థత అర్థమవుతుందన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మొద్దునిద్ర వీడి ఫీజు రీయింబర్స్మెంట్ ఫీజు బకాయిలను విడుదల చేయాలని, విద్యార్థులను ఆదుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఫీజులు విడుదల చేసేంత వరకూ జిల్లాలోని విద్యార్థి లోకం ఈ బంద్‌లో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

వైద్యశిబిరంలో మాట్లాడుతున్న పిఒ పవర్ స్వప్నిల్ జగన్నాథ్

మెగా వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఏరియా ఆసుపత్రిలో స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మెగా వైద్య శిబిరం నిర్వహించారు ఈ శిబిరాన్ని ఐటిడి ఎ పిఒ పవర్ స్వప్నిల్ జగన్నాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇలాంటి మెగా వైద్య శిబిరాలు మహిళలకు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ఈ మెగా వైద్య శిబిరానికి 369 రోగులు వచ్చారు. అయితే దీనిలో ఎన్‌సిడి కేసెస్ 104, గైనకాలజిస్ట్ 73, పీరియాటిక్ 52, హార్ట్ 37, కంటి రోగులు 20, డెంటల్ 18 ఇయర్ 21 ఎమర్జెన్సీ 20 క్యాన్సర్ స్క్రీనింగ్ 24 పరీక్షలు చేశారు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించగా, 36 యూనిట్లు సేకరించారు చుట్టుపక్కల గ్రామాలు, మండలాల నుండిప్రజలు వచ్చి వైద్యపరీక్షలు చేయించుకున్నారు. రోగులకు మందులు ఉచితంగా పంపిణీ చేశారు, అత్యవసర కేసులను ఆసుపత్రిలో వైద్య సేవలు అందిస్తున్నారు . అంతకుముందు పిఒ ఏరియా ఆసుపత్రిని క్షుణ్ణంగా పరిశీలించారు. రోగులకు వైద్య సేవలు ఏ విధంగా అందుతున్నాయో సూపరింటెండెంట్ శ్రీనివాసరావుకి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్వో విజయ, వైద్య నిపుణులు రాజేష్, జస్వంతి, కుటమి నాయకులు రమణమ్మ, చిరంజీవిలు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరాల ద్వారా ప్రజలకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందేలా చూడాలని జిల్లా ఎన్.సి.డి ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు సూచించారు. మండలంలోని పెదంకలాం పిహెచ్‌సిలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన వివిధ కౌంటర్ల వద్ద అందజేస్తున్న ఆరోగ్య పరీక్షలు, వైద్య సేవలు పరిశీలించారు. స్పెషలిస్ట్ వైద్యులు, వైద్యాధికారులు, ఆయుష్ వైద్య సేవల విభాగాలను తనిఖీ చేసి ఎంత మంది ప్రజలు వినియోగించుకున్నారు, ఆరోగ్య సమస్యలు, చికిత్సా వివరాల పరిశీలించారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ పి.శ్రీకాంత్, ఎపెడిమియాజిస్ట్ డా.కౌశిక్,ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ హేమాక్షి, స్పెషలిస్ట్ వైద్యులు డా.నిహారిక, డా.స్నిగ్ధ, డా.పావని, ఇఒ సూర్యనారాయణ, వైద్య సిబ్బంది,అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులు అర్హులైన గిరిజన అభ్యర్థులతో భర్తీ చేయాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం అందజేశారు. అనంతరం రంజిత్ కుమార్ మాట్లాడుతూ అధ్యాపకుల్లేకుండా చదువులెలా అని ప్రశ్నించారు. తక్షణమే అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని కోరారు. స్పందించినకలెక్టర్ గిరిజన సంక్షేమ గురుకుల సొసైటీ రాష్ట్ర స్థాయి అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడుతూ అధ్యాపకుల నియామకాలు చేపడుతామని తెలిపారని చెప్పారు. ఐటిడిఎ నిధులు కేవలం గిరిజన సంక్షేమం కోసం మాత్రమే వినియోగించాలని, రెగ్యులర్ పిఒ, డిడి నియామకం కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. ఐటిడిఎ పాలక వర్గం సమావేశం ఏర్పాటు చేసి గిరిజన సంక్షేమం కోసం చర్యలు తీసుకోవాలని, రోడ్లు, తాగునీరు, పారిశుధ్యం, ఆరోగ్యం తదితర సమస్యలు పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే రెగ్యులర్ డిఇఒ నియామకం, బదిలీ ఐన డ్వామా పీడీ ని రిలీవ్ చేయాలని కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం నాయకులు కొండగొర్రి చిన్నారావు, కోలక మల్లేష్, జట్ల బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌పిఒలు రైతులకు ఉపయోగకరంగా ఉండాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

రైతు ఉత్పత్తిదారుల సంఘాలు రైతులకు ఉపయోగకరంగా ఉండాలని రైతు సాధికార సంస్థ సిలబస్ డెవోలోప్మెంట్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్.డి. పారినాయుడు తెలిపారు. మండలంలోని తోటపల్లి జట్టు సంస్థ ప్రాంగణంలో జట్టు సంస్థ, వెలుగు స్వచ్ఛంద సంస్థలకు చెందిన 8 (ఎఫ్‌పిఒ) అవుట్ పుట్ బిజినెస్ అభివృద్ధి చేసుకోవడానికి డేటాను ఉపయోగించడంపై డైరెక్టర్లకు రెండు రోజుల శిక్షణను పారినాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎఫ్‌పిఒలు చేసే వివిధ కార్యకలాపాలు రైతులకు కావాల్సిన ముడి సరుకులు, వారు పండించే ఉత్పత్తులు మార్కెట్ చేయడం వల్ల దళారుల సమస్య లేకుండా గిట్టుబాటు ధర వచ్చేలా ఉపయోగకరంగా ఉండాలని తెలిపారు. ఈ శిక్షణలో నేర్చుకున్న అంశాలు విధిగా తమ ఎఫ్‌పిఒలో ఆచరించి ఒక ఉన్నత స్థాయిలో ఎదగాలని సూచించారు. డిజిటల్ గ్రీన్ ఫౌండేషన్ (డీజీఫ్) స్టేట్ కోఆర్డినేటర్ కమలాకర్ మాట్లాడుతూ ఎఫ్‌పిఒలకు అవసరమైన సాంకేతిక పరమైన శిక్షణలు, సలహాలు, యాప్‌లు గురించి అవగాహన ఇస్తున్నామని, ఇకపై ఇవ్వడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో జట్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.ప్రహరాజ్, శిక్షకులు గిరిబాబు, నూకం నాయుడు, సిఇఒలు పి.మురళి, డి.వెంకటనాయుడు, క్రాంతి కుమార్ మిగతా డైరెక్టర్లు పాల్గొన్నారు.

మెగా డిఎస్‌సిలో గిరిజనులకు తీవ్ర అన్యాయం

విద్యార్థుల అరెస్టుపై గిరిజన జెఎసి ఖండన

ప్రజాశక్తి - సాలూరు

మెగా డీఎస్సీ-2025లో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఈ అన్యాయాన్ని ప్రశ్నించడానికి వచ్చిన నిరుద్యోగ యువతను అరెస్టు చేయడం అమానుషమని అఖిల భారత గిరిజన హక్కుల పోరాట సమితి తీవ్రంగా ఖండించింది. మండలంలోని మెట్టవలసలో నిరుద్యోగ గిరిజన యువతను అక్రమంగా అరెస్టు చేయించడాన్ని అమానుషమైన చర్యగా జెఎసి నాయకులు పేర్కొన్నారు.

ఏజెన్సీకి ప్రత్యేక డిఎస్‌పి కోరుతూ జెఎసి డిమాండ్

ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలకు, ఇప్పుడు జరుగుతున్న పరిణామాలకు పొంతన లేదని ఎజెఎసి మండల అధ్యక్షులు నిమ్మక అన్నారావు తెలిపారు. ఈ సందర్భంగా డిఎస్‌సి అభ్యర్థులతో కలిసి మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి ఈ సమస్యను పరిష్కారానికి ఎలాంటి కృషి చేయలేదని, కనీసం తమను కలవడానికి వచ్చిన నిరుద్యోగ యువతతో మాట్లాడకుండా, వారి సమస్యలు వినకుండా అరెస్టు చేయించడం దారుణమని అన్నారు. గతంలో సీతంపేటలో జరిగిన ధర్నాలో 1,600 పోస్టులు గిరిజనులకు కేటాయిస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు కనీసం 200 పోస్టులు కూడా ఇవ్వలేదని, గిరిజనులకు న్యాయం జరగాలంటే ఏజెన్సీ ప్రాంతంలో ప్రత్యేకంగా ఒక స్పెషల్ డీఎస్సీని నిర్వహించాలి" అని డిమాండ్ చేశారు. ఎజెఎసి వర్కింగ్ ప్రెసిడెంట్ కొండ గొర్రి సూర్యారావు మాట్లాడుతూ ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి సంధ్యారాణి ఇచ్చిన హామీలు నమ్మి గిరిజన విద్యార్థులు మోసపోయారని, ప్రభుత్వం ఈ ఉద్యమాన్ని అణచివేయాలని ప్రయత్నిస్తే పెద్ద ఎత్తున పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామని, కూటమి ప్రభుత్వం తమ వైఖరిని మార్చుకోకపోతే తిరుగుబాటు తప్పదు" అని ఆయన హెచ్చరించారు. డిఎస్‌సి అభ్యర్థులు కె.సతీష్, ఎం.సుజాత మాట్లాడుతూ గిరిజనులకు విద్యా అవకాశాలు తక్కువగా ఉంటాయని,బయట ప్రాంతాలకు వెళ్లి కోచింగ్ తీసుకునే ఆర్థిక స్తోమత ఉండదని,అలాంటి పరిస్థితులలో జనరల్ విద్యార్థులతో పోటీ పడటం చాలా కష్టమన్నారు. తమకు 74 కటాఫ్ మార్కులు పెడితే ఎలా ఉద్యోగాలు ఎలా వస్తాయని ప్రశ్నించారు. మాకు కేటాయించిన ఉద్యోగాలు కూడా జనరల్ వారికి కేటాయిస్తే తాము ఎలా బతకాలని ప్రశ్నించారు.

ఎన్‌సిఎస్ చక్కెర పరిశ్రమను తెరిపించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

సీతానగరం మండలం లచ్చయ్యపేట ఎన్‌సిఎస్ షుగర్ ఫ్యాక్టరీని తెరిపించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర కోరారు. సోమవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో చెరకు రైతుల సమస్యలపై ఎమ్మెల్యే విజయచంద్ర ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం నియోజకవర్గంతో పాటు బొబ్బిలి నియోజకవర్గ రైతులు అధికంగా చెరకు పండించే వారని, ఈ పంట వాణిజ్య పంటగా రైతులు భావించే వారని అన్నారు. సుమారుగా రెండు లక్షల టన్నుల చెరకు క్రషింగ్ అయ్యేదన్నారు. వైసిపి హయాంలో ఈ సుగర్ ఫ్యాక్టరీ మూసివేయడమైందన్నారు. ఎన్‌సిఎస్ సుగర్ ఫ్యాక్టరీలో పనిచేసిన సీనియర్ ఉద్యోగులకు పిఎఫ్ గానీ, గ్రాడ్యుటీ ఇతర బకాయిలు చెల్లించకపోవడం అన్యాయన్నారు. ఈ ఫ్యాక్టరీలో పనిచేసిన పిఎఫ్ హెూల్డర్స్, సీనియర్ ఉద్యోగులు ఎవరైతే ఉన్నారో వాళ్లలో ఒక్కొక్కరుగా మృతి చెందుతున్నారని, వారి కుటుంబాలకు ఈ బెనిఫిట్స్ రావడంలేదని, దీంతో వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చెరకు రైతులు, ఫ్యాక్టరీ ఉద్యోగులు ఇబ్బందులు పడకుండా ఉండాలంటే ఫ్యాక్టరీని తిరిగి పున ప్రారంభించాలని కోరారు. ఫ్యాక్టరీ మూతపడడానికి గల కారణాలు తెలుసుకోవడానికి ప్రత్యేక కమిటీని వేయించాలని, చెరకు రైతుల, ఫ్యాక్టరీ ఉద్యోగుల కుటుంబాలను ఆదుకోవడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమస్యలపై సంబంధిత శాఖ మంత్రికి విన్నవించినట్టు తెలిపారు. ఎన్సిఎస్ షుగర్ ఫ్యాక్టరీ తెరవడానికి, అందులో పని చేసిన సీనియర్ ఉద్యోగులకు పిఎఫ్ గ్రాడ్యుటీ మంజూరు, ఉద్యోగులను కొనసాగించడానికి జాయింట్ ఇన్స్పెక్షన్ కోసం సంబంధిత మంత్రి, కార్మిక శాఖ అధికారులు వచ్చి పరిశీలించాలని కోరారు.

కుక్కకాటుపై ప్రజలకు అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - కురుపాం

కుక్క కాటు వల్ల కలిగే ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని పశు సంవర్ధక శాఖ జిల్లా వైద్యాధికారి మన్మధరావు అన్నారు. సోమవారం కురుపాంలో పశు వైద్య కార్యాలయం వద్ద కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల అధికారులు, పశువైద్య సిబ్బందితో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు వీధి కుక్కలు కాటు వల్ల రాబిస్ వ్యాధి రాకుండా టీకాలు వేయాలంటే పంచాయతీల కార్యదర్శులు, సిబ్బంది సహకరిస్తే శతశాతం రాబిస్ టీకాలు వేయగలమని తెలిపారు. కావున ఎంపిడిఒలు, తహశీల్దార్లు తమ కింద స్థాయి సిబ్బందికి తెలియజేసి పశు వైద్య సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి, ఇఒపిఆర్‌డి రమేష్ బాబు, పశువైద్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సంధ్య, పశు వైద్యాధికారులు కె. శైలజ, పి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : వెటర్నరీ, మండల పరిషత్, రెవెన్యూ శాఖల సమన్వయంతో గ్రామాల్లో కుక్కల నియంత్రణ, వ్యాక్సినేషన్ జరిగేలా ప్రణాళికలు తయారు చేయాలని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ టి.త్రిసంధ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వెటర్నరీ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. కుక్కల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలు పై సూచనలు ఇచ్చారు. తహశీల్దార్ శేఖర్ మాట్లాడుతూ గ్రామాల్లో ఎన్ని కుక్కలు ఉన్నాయి, ఎంత వ్యాక్సిన్ అవసరం వంటి వివరాలు ఇవ్వాలని అన్నారు. కుక్కలను పట్టుకునేందుకు రాజమండ్రి నుంచి ఒక బృందం వస్తుందన్నారు. కుక్క కాటుకు దూరంగా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమం లో ఎంపిడిఒ ఎల్ శ్రీనివాసరావు, పశువైద్యాధికారి పి లక్ష్మణరావు ఉన్నారు.

బాణాలు పట్టుకొని వీధుల్లో తిరుగుతున్న విద్యార్థులు

ఏదయా మీ దయ?

దసరా సంస్కృతి ఉట్టిపడేలా..

ప్రజాశక్తి - మక్కువ

పాతకాలం నాటి పాఠశాలలో ఉండే సంస్కృతులను మళ్లీ గుర్తుచేస్తూ మక్కువ పురవీధులలో విద్యార్థులు బాణాలు పట్టుకొని 'ఏదయా మీ దయ..' అంటూ దసరా పాటలు పాడుతూ చేసిన ప్రదర్శన పలువుర్ని ఆకట్టుకుంది. మండల కేంద్రం మక్కువలో ఉన్న తారకరామా ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం పిల్లలచే దసరా సంబరాలను జరిపించారు. సోమవారం బాణాలను చేతబట్టి పువ్వులు, వెదజలుతూ పురవీధుల్లో తిరిగారు. తల్లిదండ్రులు, పెద్దల ఆశీర్వాదం తీసుకున్నారు. సమయం దొరికితే చాలు చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు సెల్ ఫోన్‌కు అతుక్కుపోయే ఈరోజుల్లో ఇలాంటి పాత స్మృతులు గుర్తుండేలా పాఠశాల యాజమాన్యం చేపట్టిన కార్యక్రమం పలువురు ప్రశంసిస్తున్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండ్ భాగ్యలక్ష్మి బోధన సిబ్బంది పాల్గొన్నారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి

ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో గిరిజనుల నిరసన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

తమ గ్రామాలకు కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతూ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో కొండ శిఖర గ్రామమైన వామసి గిరిజనులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మండల నాయకులు ఎం.సన్యాసిరావు మాట్లాడుతూ వామసి, శిఖరపాయిలో సుమారు 40 కుటుంబలున్నాయని, అయితే మౌలిక సదుపాయాలు, రోడ్డు సౌకర్యం లేకపోవడంతో డోలి మోతలు తప్పడం లేదని, పండించే పంటలను సంతలో అమ్ముకోవడానికి, మార్కెట్‌కు నిత్యవసర వస్తువులు కోసం వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉందని తెలిపారు. రోడ్డు సౌకర్యం లేకపోవడం వల్ల వాహనాలు సైతం కొండ కిందనే ఉంచి కాలినడకన గ్రామానికి వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు రోజులు ముందు కలెక్టర్ తాడికొండ గ్రామాలను సందర్శించినా మా గ్రామాల సమస్యలపై స్పందించకపోవడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మా గ్రామాలకు బిటి రోడ్డు నిర్మించాలని, తాగునీరు, విద్య, వైద్యం వంటి మౌలిక వసతులు మెరుగుపరచాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు గంగారావు, గిరిజనులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పోషకాహారం తీసుకోవడం ద్వారా గర్భిణీలకు రక్తహీనత లేకుండా సుఖప్రసవాలకు వీలుంటుందని, తల్లిబిడ్డ ఆరోగ్యవంతులుగా ఉంటారని విసిఎఫ్ ప్రతినిధి ఎస్ శ్రీనివాసరావు అన్నారు. భద్రగిరి ఐసిడిఎస్ పరిధిలోని టిక్కబాయిలో విజయ వాహిని చారిటబుల్ ఫౌండేషన్ సపోర్ట్ బై టాటా ట్రస్ట్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ సమన్వయంతో పోషన్ మా- 2025 కార్యక్రమం పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. తల్లులకు శిశు, బాలల పోషణ, సంతులిత ఆహారం, స్వచ్ఛత, ఆరోగ్య రక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎన్ గౌరమ్మ, సర్పంచ్ హైమావతి, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

కొమరాడ : మండలంలోని కల్లికోట సచివాలయం పరిధిలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషణ్ మహ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు సీమంతలు చేసి ప్రభుత్వం అందిస్తున్న పౌష్టిక ఆహారంపై అవగాహన కల్పించారు. అనంతరం డిపిఎంఒ రాజు మాట్లాడుతూ పోషణ్ అభియాన్ కింద, 'పంచ సూత్రాలు', పోషకాహారం యొక్క ఐదు వనరులు - పిల్లల మొదటి 1000 రోజులు, రక్తహీనత, విరేచనాలు, చేతులు కడుక్కోవడం, పారిశుధ్యం, పౌష్టికాహారం అందించడంపై వినియోగించడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి శిరీష, అంగన్వాడీ సూపర్వైజర్లు, ఎంఎల్‌హెచ్ఒ నరేంద్ర, అంగన్వాడీ కార్యకర్తలు పి.దేవి, శకుంతల, నాగమణి, హెల్పర్లు సిబ్బంది. గర్భిణీలు, పాల్గొన్నారు.

వరి సాగును పరిశీలించిన కెవికె బృందం

ప్రజాశక్తి - కురుపాం

కృషి విజ్ఞాన కేంద్రం, ఆర్ఆర్ఎస్ చింతపల్లి శాస్త్రవేత్తల బృందం సభ్యులు డాక్టర్ ఎ. అప్పలస్వామి, డాక్టర్ ఎస్.ధ్రువ, ఎస్.శ్రీనివాసరాజు, ఎం.అనంత విహారి, డాక్టర్ ఎస్.స్రవంతి, అమృతవీణ, పెదమేరంగి, అడ్డాపుశీల, డి.ములగ, గంగిరేగువలస గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న వరి పొలాలను సోమవారం క్షేత్ర స్థాయిలో సందర్శించారు. ఈ సందర్భంగా పొలంలో సాగు చేస్తున్న వరి రకం బిపిటి 2841, చిరు సంచులు ఆర్ఎల్ 7030, 7045 ప్రదర్శనను పర్యవేక్షించారు. బయోమెట్రిక్ గణంకాలు సేకరించి రైతులకు వరి దుబ్బులకు తెగుళ్లు, పురుగు చేరకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

ఎంపిడిఒ కార్యాలయంలో స్వచ్ఛభారత్

పాలకొండ : స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో స్వచ్ఛ ఆంధ్ర -స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా సోమవారం కార్యాలయ ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగించారు. చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడం వంటి కార్యక్రమాన్ని ఎంపిపి ప్రతినిధి బొమ్మాలి సుధాకర్ రావు, వైస్ ఎంపిపి వాకమూడి అనిల్ కుమార్ ఎంపిడిఒ పాలవలస మురళీధర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రతి కార్యాలయం, గ్రామాలు, సచివాలయాలు పంచాయతీల్లో కచ్చితంగా పరిశు భ్రతకు సంబంధించిన కార్యక్రమాలు పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన కార్యక్రమాలు విరివిగా జరగాలన్నారు.